


RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం

ద్వి భాషా దినపత్రిక

ROYAL JOURNLISAM

గుంటూరు, సంపుటి : 02 సంచిక : 166 | ఆదివారం 27 - 7 - 2025 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 | వెల : రూ.2-00

GUNTUR VOL-02 ISSUE - 166 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 27 SUNDAY JUIY 2025 PAGES : 8 Rs :2-00


## జైపాల్ రెడ్డి లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: జైపాల్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయన పాత్ర ఎన్నటికీ మరువలేనిదన్నారు. జైపాల్ రెడ్డి లేకుంటే తెలంగాణ సాకారమయ్యేది కాదని చెప్పారు. 'జైపాల్‌రెడ్డి మెమోరియల్ అవార్డు' ప్రదానోత్సవానికి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైపాల్‌రెడ్డికి ప్రతిపక్ష పార్టీలతో సిద్ధాంతపరంగా మాత్రమే విభేదాలు ఉండేవని, రాజకీయాల్లో 40 ఏళ్లపాటు ఆయన అజాతశత్రువుగా ఉన్నారని చెప్పారు." సమాచారహక్కు చట్టం రావడంలో జైపాల్‌రెడ్డి కృషి ఎంతో ఉంది. సంస్కరణల అమలుకు కూడా ఆయన ఎంతో తాపత్రయపడేవారు. కల్వకుర్తి ప్రాంతంలో మార్పుల కోసం ఎంతో కృషి చేశారు. తెలంగాణ నుంచి పీవీ నరసింహారావు తర్వాత అంతపేరు తెచ్చుకున్నది జైపాల్ రెడ్డి మాత్రమే. రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గాలని ఆయన చెబుతుండేవారు. తెలంగాణ కోసం జైపాల్‌రెడ్డి ఎంతో చొరవ చూపారని సోనియాగాంధీ కూడా ఓసారి చెప్పారు. ఇవాళ ఐడియాలజీ పాలిటిక్స్ కనుమరుగై.. స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయి. ఇవాళ రాజకీయాలు ప్రమాదకరమైన దిశలో వెళ్తున్నాయి. ప్రజాస్వామిక విలువలు తగ్గి.. పొలిటికల్ మెనేజ్‌మెంట్ పెరిగింది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే 'తెలంగాణ జాగృతి' ఊరుకోదు: కవిత




కుత్బుల్లాపూర్: తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన 'లీడర్' శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కొత్త నాయకత్వాన్ని పెంపొందించాలనుకుంటున్నట్లు చెప్పారు. కాలానుగుణంగా తెలంగాణ జాగృతి తన పంథాను మార్చుకుందని అన్నారు. మన సంప్రదాయాలు, కట్టుబాట్లపై అవగాహన కల్పించుకోవడమే లీడర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. "ఎప్పుడూ కొత్తగా ఉంటేనే సంస్థలు బతుకుతాయి. తల్లి గర్భంలో నుంచి ఎవరూ నాయకత్వ లక్షణాలతో పుట్టరు. నేర్చుకుంటూ, మార్చుకుంటూ ముందుకెళ్లేవాడే నాయకుడవుతాడు తప్ప.. మూస పద్ధతిలో కొనసాగేవాడు నాయకుడు కాలేడు. సామాజిక స్పృహ కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ 11 స్థానంలో ఉందని ఓ సర్వేలో తేలింది. తోటివారి గోప్యతకు, మర్యాదకు భంగం వాటిల్లకుండా పదునైన విమర్శలు చేయడం నేర్చుకోండి. పక్కవాడిని తిడుతున్నారంటే కంటెంట్ లేనట్లు అర్థం. మహాత్మాగాంధీ ఎప్పుడూ ఎమ్మెల్యేగానో, ఎంపీగానో లేరు. కానీ, ఇప్పటికీ ఆయన్ని గుర్తు చేసుకుంటాం. తెలంగాణ జాగృతి నుంచి గాంధీగిరీకి కొత్త భాష్యం చెప్పాల్సిన అవసరం ఉంది. సాంస్కృతిక నేపథ్యం లేకుండా ఏ జాతీ మనుగడ సాధించలేదు. సాంస్కృతిక నేపథ్యం లేని జాతి.. పునాది లేకుండా కట్టిన బిల్డింగ్ లాంటిది. తెలంగాణ జాతికి అద్భుతమైన నేపథ్యం ఉంది. దానిని పరిరక్షించేందుకే 'జాగృతి' పని చేస్తుంది. తెలంగాణ ఉద్యమ కాలంలో యాసను అవహేళన చేసిన ఓ వ్యక్తికి నంది అవార్డు ఇవ్వడాన్ని నిరసించిన ఒకే ఒక సంస్థ తెలంగాణ జాగృతి. నమ్మిన సిద్ధాంతం కోసం ఎంత పెద్ద వ్యక్తులైనా, ఎంత పెద్ద సమస్య అయినా ఎదురొడ్డి నిలిచిన సంస్థ ఇది. తెలంగాణ రాకముందు రాష్ట్రం కోసం పని చేశాం. వచ్చిన తర్వాత ప్రజల అభివృద్ధి కోసం పని చేశాం. రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే తెలంగాణ జాగృతి ఊరకోబోదు" అని కవిత అన్నారు.

## అమరావతిలో మారుతున్న లెక్కలు

### ఏం జరుగుతోంది..!



అమరావతి: ఏపీ రాజధాని అమరావతి కేంద్రంగా కీలక సమీకరణాలు చోటు చేసుకుంటున్నాయి. 2024 ఎన్నికల ఫలితాల్లో రాజధాని అంశం డిసైడింగ్ ఫ్యాక్టర్ గా నిలిచింది. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తరువాత అమరావతిలో కదలిక వచ్చింది. పనులు ప్రారంభం అయ్యాయి. కాగా, రెండో విడత భూ సమీకరణ అంశం మొత్తంగా సమీకరణాలపైనే ప్రభావం పడింది. ఇప్పటికీ సీఆర్డీఏ ఈ అంశం పైన స్పష్టత ఇవ్వటం లేదు. అటు జగన్ రాజధాని పైన ఆసక్తి కర వ్యాఖ్యలు చేసారు. సమీకరణ పై పవన్ అభిప్రాయం పైన చర్చ జరుగుతోంది. అమరావతి కేంద్రంగా ఆసక్తి కర పరిణామాలు తెర మీదకు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏపీ రాజధాని అమరావతి నిర్మాణాలను మూడేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. టెండర్లు పిలిచి పనులు అప్పగించింది. మాజీ సీఎం జగన్ మూడు రాజధానులు అంటూ అమరావతిని పూర్తిగా విస్మరించారు. ఫలితంగా ఎన్నికల్లో ఓడిపోయారు. ఇప్పుడు అమరావతి వ్యతిరేక వ్యాఖ్యలు ఏ మాత్రం చేయటం లేదు. అమరావతి నిర్మాణంలో ఖరారు చేస్తున్న ధరల పైన ప్రశ్నించారు. అడుగు నిర్మాణానికి ఇంత ఖర్చు ఎక్కడైనా ఉందా అని వ్యాఖ్యానించారు. కాగా, రాజధాని విస్తరణ కోసం ప్రభుత్వం ప్రతిపాదించిన రెండో విడత భూ సమీకరణ పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అమరావతి భూ సమీకరణ పైన రైతుల్లో ఏకాభిప్రాయం లేదు. సీఆర్డీఏ నిర్వహించిన గ్రామ సభల్లో పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేసారు. రాజధాని కేంద్రంగా చోటు చేసుకుంటున్న పరిణా మాల పైన డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. మంత్రివర్గ భేటీలో రెండో విడత భూ సమీకరణ పైన పునరాలోచన చేయాలని సూచించినట్లు సమాచారం. తాజాగా పవన్ ఇచ్చిన ఇంటర్వ్యూల్లోనూ అక్కడ ఇతరులకు గందరగోళం చేసేందుకు... ప్రభుత్వాన్ని విమర్శించేందుకు అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే తన సూచన చేసానని చెప్పుకొచ్చారు. రాజధానిలో చోటు చేసుకొంటున్న పరిణామాలను వైసీపీ నిశితంగా గమనిస్తోంది. తాజాగా రాజధాని రైతులకు కౌలు డబ్బులు అందించింది. అయినా రైతుల్లో ఎక్కడా ఆనందం కనిపించటం లేదు. రాజధాని కోసం భూమిలిచ్చిన 29,498 మంది రైతుల్లో 23,384 మందికి మాత్రమే కౌలు పొందేందుకు అర్హులుగా ఉన్నారు. అయితే, వారికి కూడా ప్రభుత్వం పూర్తి స్థాయిలో కౌలు చెల్లించ లేదు. 18,638మందికి మాత్రమే కౌలు చెల్లించింది. అయితే, కొందరి బ్యాంకు ఖాతాల్లో కోడ్ తప్పుగా ఉండటంతో నగదు జమ కాలేదని మంత్రి నారాయణ చెబుతున్నారు. భూములు ఇచ్చిన రైతులకు ఏటా పది శాతం పెంచాల్సి ఉంది. ఈ క్రమంలో కౌలు మొత్తం పెరుగుతూ వచ్చింది. అయితే, ఈ పదేళ్లలో రైతుల సంఖ్య తగ్గింది. 29,498 గా ఉండాల్సిన రైతుల సంఖ్య ఇప్పుడు 23,384 కి పడిపోయింది. ఇక.. రెండో విడత సమీకరణ పైన సీఆర్డీఏ నుంచి స్పష్టత రావటం లేదు. ప్రస్తుత సింగపూర్ పర్యటన ద్వారా రాజధానిలో తిరిగి వారి భాగస్వా మ్యం ఏంటనేది స్పష్టత రానుంది. మొత్తంగా.. అమరావతిలో మాత్రం ప్రస్తుత పరిణామాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి.

## గోవా గవర్నర్‌గా అశోక్ ప్రమాణం





అమరావతి: ఏపీ రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల పాటు వివిధ పదవుల్లో పనిచేసిన సీనియర్ నేత అశోక్ గజపతిరాజు ఇవాళ గోవా గవర్నర్ గా బాధ్యతలు చేపట్టారు. గోవా రాజ్ భవన్ లో జరిగిన ఓ కార్యక్రమంలో అశోక్ గజపతిరాజు గవర్నర్ గా ప్రమాణ స్వీకారం చేశారు. అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఏపీ మంత్రులు, రాజకీయ నేతలు, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్ గా నియమించింది. దీంతో బోంబే హైకోర్టు ఛీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ఇవాళ గోవా రాజ్ భవన్ లోని దర్బార్ హాల్లో ఆయనతో గవర్నర్ గా ప్రమాణస్వీకారం చేయించారు. ఇంగ్లీష్ లోనే గవర్నర్ గా అశోక్ గజపతిరాజు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఆయన్ను ఛీఫ్ జస్టిస్ అభినందించారు. ఈ కార్యక్రమానికి తెలుగు వారు భారీగా హాజరయ్యారు. ముందుగానే అపాయింట్ మెంట్లు తీసుకున్న వీరంతా ప్రమాణస్వీకారాన్ని నేరుగా తిలకించారు. కేంద్ర పౌర విమానయానమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్రమంత్రులు నారా లోకేష్, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు నేతలు ఈ కార్యక్రమానికి హాజరై అశోక్ గజపతిరాజుకు అభినందనలు తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఇవాళ సింగపూర్ టూర్ కు వెళ్తుండటంతో ఈ కార్యక్రమానికి రాలేకపోయారు. దీంతో లోకేష్ సహా పలువురు మంత్రుల్ని పంపారు. అలాగే అశోగ్ గజపతిరాజు కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమ్మానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి, ఎంపీ, కేంద్రమంత్రిగా నాలుగు దశాబ్దాల పాటు పని చేసిన అశోక్ గజపతిరాజును చంద్రబాబు సిఫార్సుతో కేంద్రం గోవా గవర్నర్ గా నియమించింది. రాజకీయాల్లో మర్యాదస్తుడిగా పేరున్న అశోక్ గజపతిరాజును గవర్నర్ గా పంపడంతో ఏపీ ప్రతిష్ఠ జాతీయ స్థాయిలో పెరిగినట్లయింది. అలాగే రాజకీయంగా అవసాన దశలో ఉన్న అశోక్ గజపతిరాజుకు కూడా గౌరవప్రదమైన పదవి లభించినట్లయింది.

## గండికోట బాలిక హత్యకేసు..350 మందిని విచారించాల్సి ఉంది: డీఐజీ



కడప: ఇటీవల కడప జిల్లా గండికోట బాలిక హత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసును ఛేదించేందుకు సాంకేతికతపైనే ఆధారపడాల్సి ఉందని డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు ఘటన జరిగిన సమయంలో పక్కనే ఉన్న గ్రామంలో జాతర జరిగిందని, రెండు సెల్ టవర్లు లొకేట్ కావడంతో 350 మందిని దాకా విచారించాల్సి ఉందని తెలిపారు. కొండను తవ్వి ఎలుకను పట్టాల్సి ఉందన్న ఆయన.. అవసరమైతే కుటుంబ సభ్యుల్ని మరోసారి ప్రశ్నిస్తామన్నారు. ఈ కేసును వీలైనంత త్వరగా ఛేదిస్తామని తెలిపారు. ఈ నెల 14న గండికోటలో ఇంటర్ విద్యార్థిని హత్యకు గురైన సంగతి తెలిసిందే. అసలు నిందితులు ఎవరో గుర్తించేందుకు పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు. సరైన ఆధారాలు లభించకపోవడంతో, సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు.

## ఏపీ డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు.. భారీగా ఆయుధాల స్వాధీనం




విజయవాడ: పలువురు మావోయిస్టులు శనివారం ఉదయం ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఎదుట లొంగిపోయారు. వారి వివరాలను డీజీపీ మీడియాకు వివరించారు. లొంగిపోయిన వారిలో రామకృష్ణ, అరుణ ఉన్నారని పేర్కొన్నారు. ఏవోబీ పరిధిలో భారీ డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ తెలిపారు. ఏకే 47, హ్యాండ్ గ్రనేడ్లు, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్న వాటిలో ఉన్నాయన్నారు. మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం అందుకుని జాయింట్ ఆపరేషన్లు నిర్వహిస్తు న్నామని తెలిపారు. రాష్ట్రానికి చెందిన దాదాపు 21 మంది ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్ వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టు సభ్యులుగా పని చేస్తున్నారని చెప్పారు. మావోయిస్టులంతా జనజీవన స్రవం తిలోకి వచ్చి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

## ఐటీ పార్క్ హైదరాబాద్, బెంగళూరు వెళ్లిపోతోంది..



న్యూఢిల్లీ : మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. నిర్వహణ లోపం వల్లే హింజెవాడిలోని ఐటీ పార్క్ హైదరాబాద్, బెంగళూరుకు తరలిపోతోందంటూ ఆయన మాట్లాడిన మాటలు వైరల్‌గా మారాయి. అజిత్ పవార్ శనివారం ఉదయం పుణె సమీపంలోని పింప్రీ చింఛ్వాడ్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. స్థానికంగా జరుగుతోన్న పనులను గమనించారు. అక్రమ నిర్మాణాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో అజిత్‌తో స్థానిక సర్పంచి గణేశ్ జంబూల్కర్ మాట్లాడారు. ప్రజా సమస్యలపై మీడియా ఎదుటే ప్రశ్నించడంతో డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. "మనల్ని మనమే నాశనం చేసుకుంటున్నాం. హింజెవాడి నుంచి ఐటీ పార్క్ వెళ్లిపోతోంది. మహారాష్ట్ర నుంచి బెంగళూరు, హైదరాబాద్ తరలిపోతోంది. కానీ మీకు ఏ పట్టింపు లేదు. ఇంత ఉదయం నేను ఇక్కడికి రావాల్సిన అవసరం ఏముంది..? ఇక నాకు ప్రత్యామ్నాయం ఏమీ లేదు. కఠిన చర్యలు తీసుకోవడం ఒక్కటే మిగిలిఉంది" అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. కెమెరాలను ఆపండి అంటూ మరోవైపు మీడియా వాళ్లకు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంలో భాగమైన ఆయన ఐటీ పార్క్ వెళ్లిపోతోందని వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మహారాష్ట్ర లోని హింజెవాడిలో 2,800 ఎకరాల్లో రాజీవ్‌గాంధీ ఐటీ పార్క్ ఉంది. అందులో 800 కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

## భారత సైన్యంలో కొత్త శక్తి.. 'రుద్ర'




న్యూఢిల్లీ : శత్రుమూకల ఆట కట్టించేలా భారత సైన్యంలో ఓ శక్తిమంతమైన దళం ఏర్పాటైంది. భవిష్యత్తు ముప్పును ఎదుర్కొనేలా 'ఆల్‌ఆర్మ్స్ బ్రిగేడ్'ను ఏర్పాటు చేసినట్లు సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. దీనికి 'రుద్ర' అని పేరు పెట్టినట్లు తెలిపారు. శనివారం 'కార్గిల్ విజయ్ దివస్ ' సందర్భంగా ఆయన అమరవీరులకు నివాళులర్పించారు. భారత సైన్యం ప్రస్తుత సవాళ్లను విజయవంతంగా ఎదుర్కోవడంతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉండేలా ఈ యూనిట్‌ను ఏర్పాటుచేసినట్లు జనరల్ ద్వివేది వెల్లడించారు. పదాతిదళం, యాంత్రిక పదాతిదళం, సాయుధ యూనిట్లు ఫిరంగిదళం, ప్రత్యేక దళాలు, మానవరహిత వైమానిక వ్యవస్థలు వంటి వ్యవస్థలతో కూడిన దళం ఇది అని వెల్లడించారు. సరిహద్దులోని శత్రువుల వెన్నులో వణుకు పుట్టించేందుకు "భైరవ్" అనే లైట్ కమాండో బెటాలియన్ యూనిట్లను కూడా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కాగా.. ఇప్పటికే రెండు పదాతిదళ బ్రిగేడ్‌లు రుద్రలో భాగమైనట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ఆయన మాట్లాడారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కలచివేసిందన్నారు. దీనికి ప్రతిస్పందనగా ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాదాన్ని సహించేది లేదనే గట్టి సందేశాన్ని పాకిస్థాన్‌కు ఇచ్చామన్నారు. దేశ ప్రజల విశ్వాసం, ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛ కారణంగా ఇది సాధ్యమైందన్నారు. మన ఐక్యత, సార్వభౌమత్వాన్ని సవాలు చేయడంతో పాటు ప్రజలకు హాని చేయాలని చూసేవారికి ఇది సరైన సమాధానం చెప్పిందన్నారు. పాక్‌లోని ఉగ్రమూకల సదుపాయాలను నేలమట్టం చేయడంతో పాటు ఆ దేశ దుందుడుకు చర్యలను కూడా అరికట్టామన్నారు. భారత్ నిర్ణయాత్మకమైన విజయం సాధించిందని వ్యాఖ్యానించారు.

రాయల్ జర్నలిజం
ROYAL JOURNLISAM

# మాజీ సర్పంచ్ అచ్చారావు సేవల మరవలేము...

కాకినాడ రూరల్:: జూలై 26: వలస పాకాల మాజీ సర్పంచ్ కొల్లు బోయిన అచ్చారావు సేవల మరవలేము అని జనసేన నాయకులు, హైకోర్టు న్యాయవాది మాజీ ఉప సర్పంచ్ సలాది శ్రీనివాస్ బాబు అన్నారు. ఇటీవల అనారోగ్యం తో అచ్చా రావు మృతి చెందాగా, నేడు సింహాద్రి నగర్ లో స్వర్గీయకొల్లిబోయిన అచ్చారావు కుటుంబసభ్యులు ఏర్పాటు చేసిన సంతాప సభ లోమాజీ ఉప సర్పంచ్ సలాది శ్రీనివాస్ బాబు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిమాట్లాడుతూ ఆనాడు ఆయన వలస పాకల పంచాయతీ సర్పంచ్ గా ఉన్నప్పుడు ఆయన హయాంలోనే నేను ఉప సర్పంచ్ గా పదవి చేపట్టడం జరిగిందని అప్పటి ఎమ్మెల్యే బుల్లబ్బాయి రెడ్డి పరిపాలనలో ఉత్తమ పంచాయతీగా వలసపాకల గ్రామపంచాయతీకి అవార్డు రావడానికి జరిగిందని గుర్తు చేశారు. ఆనాడు గ్రామంలో సిసి రోడ్లు, బీసీ కాలనీ, సుందరయ్య కాలనీలో సుమారు 300 మందికి ఇళ్ల పట్టాలు మా హయాంలో ఇచ్చామన్నారు. బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన అచ్చారావు ఎప్పుడు నిరాడంబరంగా సౌమ్యంగా ఉంటూ అందర్నీ గౌరవించే వారని అలాంటి మంచి వ్యక్తి మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమని, ఆ కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# కొత్త సుబ్బారావు సౌజన్యంతో గర్భిణీలకు అందించిన పౌష్టిక ఆహారం



రాయల్ జర్నలిజం(బాపట్ల) జూలై 26: రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల వారి ఆధ్వర్యంలో శనివారం స్థానిక వివేకా నంద కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ నందు గర్భిణీ స్త్రీలకు రోటరీ కోశాధికారి కొత్త సుబ్బారావు సౌజన్యంతో పౌష్టిక ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు, గర్భంతో ఉన్న వారందరూ ఈ సమయంలో ఎంత ఆనందంగా ఉత్సాహంగా ఉంటే, పుట్టే బిడ్డ కూడా అంతే ఆనందంగా ఉత్సాహంగా ఉంటారని, మీ కడుపులోని బిడ్డ మీరు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని, వైద్యులు సలహాలను తూచా తప్పకుండా పాటించాలని, మా రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల తరఫున మీకు మీ పుట్టబోయే బిడ్డకు శుభాశీస్సులు తెలియపరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమ0లో రోటరీ క్లబ్ ఆఫ్ కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జిట్టా శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు ఉపేంద్ర గుప్త, సీనియర్ రోటరీ సభ్యులు ఇ. హరిబాబు, బుర్లె రామ సుబ్బారావు, జెవి కృష్ణారావు, ఎం సుధీర్ కుమార్, కొల్లా శ్రీనివాసరావు, ఎల్.పి కుమార్, శివరామకృష్ణ, కోళ్లపూడి బాలాజీ, టి.మల్లికార్జున్ రావు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులకు, సిబ్బంది పాల్గొన్నారు.



# అగ్నిప్రమాద బాధితులకు చేయూతనందించిన "విన్నకోట"



రాయల్ జర్నలిజం(బాపట్ల) జూలై 26: నియోజకవర్గ ంలోని గణపవరం పంచాయతీ పరిధిలోని ఉర్లమ్మ ఎస్టీ కాలనీలో ఇటీవల అగ్నిప్రమాదానికి గురై సర్వసం కోల్పోయిన నిరుపేద గిరిజన దంపతులు నక్కా కోటయ్య, ఉర్లమ్మలకు జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్ అండగా నిలిచారు. శుక్రవారం సంఘటనా స్థలానికి ప్రమాదవశాత్తు దగ్ధమైన గృహాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించి బాదితులకు పార్టీ తరపున రూ. 16,000 నగదుతో పాటు, మినీ గ్యాస్ సిలిండర్‌తో కూడిన స్టవ్, వంటపాత్రలు, బియ్యం, నిత్యవసర సరుకులు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన నక్కా కోటయ్య కుటుంభాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, అలాగే మరిన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి వారికి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కర్లపాలెం మండలం అధ్యక్షుడు, మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ గొట్టిపాటి శ్రీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకల సురేంద్ర, జనసేన నాయకులు తిరుమలశెట్టి దయాసాగర్, కారుమూరి ఆంజనేష్, గరిగంటి శ్రీనివాస్ రావు, రాంబాబు, సురినేని రాజేష్, గురాల రామారావు, తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షురాలు ఇనగంటి సునీత, జనసేన, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## జాతీయ అవార్డు లభించడంతో చేనేత రంగం మరింత

# అభివృద్ధి కానుంది: జిల్లా కలెక్టర్ వెంకట మురళి

- పేదరికంలో జన్మించిన అంబేద్కర్ కు సహాయం అందించడంతోనే ఉన్నత విద్యనభ్యసి0చాడు
- చేనేతల ఆర్థిక అభివృద్ధికి విరివిగా రుణాలు ఇవ్వాలి
- ప్రాచీన కాలం నుండి చీరాలలో నేత వస్త్రాల తయారీ ఉంది
- చేనేత కార్మికుల ఆర్థిక అభివృద్ధికి రుణాలతో ఆదుకోవాలి



రాయల్ జర్నలిజం(బాపట్ల) జూలై 26: పి4 కింద గుర్తించిన బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తెచ్చేలా ఆర్థిక చేయూతను అందించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పి4, సూర్య ఘర్, చేనేతల అభివృద్ధి అంశాలపై చీరాల నియోజకవర్గం స్థాయి సమావేశం మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. "ఒక జిల్లా ఒక ఉత్పత్తి" కింద కుప్పడం పట్టు చీరలకు జాతీయస్థాయి అవార్డు లభించడంతో జిల్లా కలెక్టర్ వెంకట మురళి, చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య కలిసి స్థానిక చేనేత కళాకారులను ఘనంగా సత్కరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ ను చీరాల శాసనసభ్యులు, చేనేత కార్మికులు కలిసి ఘనంగా సన్మానించారు. చేనేత కళాకారుల నైపుణ్యంతోనే కుప్పడం చీరలకు జాతీయస్థాయి అవార్డు లభించిందని, అందుకే ఈ అవార్డును చేనేత కళాకారులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ముందుగా మెప్మా పరిధిలోని 30 డ్వాక్రా సంఘాలకు రూ. 6 కోట్లు రుణాలు, వెలుగులోని 40 డ్వాక్రా సంఘాలకు రూ.ఏడు కోట్లు రుణాలను చెక్కుల రూపంలో కలెక్టర్ పంపిణీ చేశారు. పేదరికంలో జన్మించిన అంబేద్కర్ కు సహాయం అందించడంతోనే ఉన్నత విద్యనభ్యసించాడని, మహనీయుడిగా ఎదిగి, దేశానికి రాజ్యాంగాన్ని రచించారని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. అలాంటి అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకుని మార్గదర్శిలు సహాయం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ జీవితంలో తోడు ఉండాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ, పేదరిక నిర్మూలనలో మార్గదర్శకుల పాత్ర ఎంతో కీలకమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి4 విధానంతో నిరుపేదలకు ఏ విధంచేతనైనా సహాయ సహకారాలు అందించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్ఫూర్తితో చెరుకుపల్లిలోని అత్యంత నిరుపేదలైన 10 యానాది కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు వివరించారు. చీరాల నియోజకవర్గంలో 8,405 బంగారు కుటుంబాలు ఉండగా, 4,400 కుటుంబాలకు 402మార్గదర్శిలను అనుసంధానించామన్నారు. మిగిలిన నాలుగువేల కుటుంబాలకు మార్గదర్శిలను గుర్తించాలన్నారు. ప్రభుత్వం గుర్తింపు, గౌరవం వారికి కల్పిస్తుందన్నారు. బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శకులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఉదార స్వభావంతో సహాయం చేయండి, జీవనోపాధి వృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. చేనేతల ఆర్థిక అభివృద్ధికి విరివిగా రుణాలు ఇవ్వాలని కలెక్టర్ చెప్పారు. మానవతా దృక్పథంతో చేనేతలందరికీ ముద్ర రుణాలు మంజూరు చేయాలన్నారు. తద్వారా చేనేతల జీవనోపాధి పెరుగుతుందన్నారు. చేనేతలను బ్యాంకులో చుట్టూ తిప్పించుకోరాదన్నారు. పర్యావరణానికి ఎలాంటి నష్టం లేని సౌర విద్యుత్ కొరకు రుణాలు ఇవ్వాలన్నారు. 1,695 దరఖాస్తులు రాగా, 327 యూనిట్లు మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకానికి ప్రోత్సాహం అందించాలన్నారు. కుప్పడం



పట్టు చీరలకు జాతీయ గుర్తింపు, అవార్డు లభించడంతో చేనేత రంగం మరింత అభివృద్ధి కానుందని కలెక్టర్ చెప్పారు. ప్రాచీన కాలం నుండి చీరాలలో నేత వస్త్రాల తయారీ ఉందన్నారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద జాతీయ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కుప్పడం పట్టు చీరలకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఈ గుర్తింపును చేనేతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుప్పడం చీరాల ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెప్పేందుకు బాపట్ల, చీరాల, ఓడరేవు, సూర్యలంక బీచ్ ల వద్ద ఓడీఓపి స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు. స్కానర్ ఏర్పాటు ద్వారా చీరాల కుప్పడం చీరల చరిత్ర తెలుసుకునేలా ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తామన్నారు. పర్యాటకులను మరింత ఆకర్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈక్రమంలో చీరాల మండలం దేవంగిపురిలో 26 ఎకరాల విస్తీర్ణంలోని హ్యాండ్లూమ్ పార్క్ ను



హ్యాండ్లూమ్ ఎం ఎస్ ఎం ఏ గా ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి అంగీకరించిందని కలెక్టర్ తెలిపారు. చేనేత రంగానికి ప్రోత్సాహాన్ని ఇవ్వడం ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అన్నారు. చేనేత కార్మికుల ఆర్థిక అభివృద్ధికి రుణాలతో ఆదుకోవాలని చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య తెలిపారు. కుప్పడం చీరలకు జాతీయ అవార్డు రావడం జిల్లా ప్రజలకు గర్వకారణం అన్నారు. అలాంటి చేనేతల వృత్తికి అవసరమైన రుణాలు విరివిగా అందించాలన్నారు. ఆంక్షలతో రుణాలు ఇవ్వకుండా నేతన్నలను ఇబ్బందులు పెట్టవద్దన్నారు. చేనేత సొసైటీలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా మరింత మంది చేనేతలకు మేలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. సూర్య ఘర్ పథకం కింద ఆగస్టు 15వ తేదీలోగా వెయ్యి గృహాలకు సౌర విద్యుత్ అందించాలన్నారు. పి4 విధానంలో కొన్ని కుటుంబాలను దత్తత తీసుకున్నానని చెప్పారు. అత్యంత నిరుపేదల ఆర్థిక అభివృద్ధికి మార్గదర్శిలు ముందుకు రావాలన్నారు. ఉదార స్వభావంతో వారిని ఆదుకోటానికి, మార్గదర్శిల ఎంపిక వేగంగా పూర్తి చేయాలన్నారు. మీ వంతు సాయం అధికారులు అందించాలన్నారు. ఈ సమావేశంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, చేరాల మున్సిపల్ చైర్మన్ ఎం సాంబశివరావు, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, సిపిఓ షాలెంరాజు, చేనేత జౌళి శాఖ ఏడి రఘునంద, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

## బంగార0, వెండి, నగదును సీజ్



రాయల్ జర్నలిజం(కర్లపాలెం) జూలై 26: దొంగతనానికి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి దొంగలించబడిన బంగారం,వెండిని స్వాధీనం చేసుకున్నట్లు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు స్పష్టం చేశారు. కర్లపాలెం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దొంగతనం చేసిన నిందితుల వివరాలను ఆయన సర్కిల్ సీఐ హరికృష్ణ తో కలిసి వెల్లడించారు. కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం కు చెందిన పిట్టల పెద్దవెంకటరెడ్డి ఆర్ఎంపి వైద్యులుగా పని చేస్తారన్నారు. ఈనెల 17వ తేదీన నివాస యజమానులైన పిట్ల పెద్ద వెంకటరెడ్డి, భార్య విజయలక్ష్మిలు పాండిచ్చేరిలోని వారి కూతురు వద్దకు వెళ్లారన్నారు. 21వ తేదీన నివాసానికి ఇంటి వెనక తలుపులు తెరుచుకుని ఉండడాన్ని గమనించిన ఫిర్యాదు తమ్ముడు పాండిచ్చేరిలో ఉన్న పెద్ద వెంకట రెడ్డికి ఇంటి వెనక తలుపులు తెరిచి ఉన్నాయని చెప్పారన్నారు. ఫిర్యాదు కుమారుడు 22వ తేదీన ఇంటి ప్రధాన తలుపు తెరిచి లోపలికి వెళ్లి చూడగా బెడ్ రూమ్ లో ఉన్న ఇనుప బీరువా లాకర్ ఓపెన్ చేసి అందులో ఉన్న బంగారం, వెండి,అయిదు వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారని తెలిపారన్నారు. అదే రోజు బాధితులు కర్లపాలెం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి సర్కిల్ సీఐ హరికృష్ణ విచారణ చేపట్టారన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అన్నీ కోణాల్లో కేసును దర్యాప్తు చేశారన్నారు. దొంగతనానికి పాల్పడిన రాజమండ్రి జిల్లా కొల్లమూరు గ్రామం ఎయిర్ పోర్టు రోడ్డుకు చెందిన ధన దివ్య శేఖర్, బాపట్ల మండలం మరుప్రోలువారి పాలెం కు చెందిన మరుప్రోలు నాగేందర్ రెడ్డి, రాజమండ్రి పుల్లాతి వీధికి చెందిన లంక హర్షవర్ధన్ ను బాపట్ల పట్టణంలో ఈనెల 25వ తేదీన అనుమానస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనానికి తామే పాల్పడ్డామని తెలపడంతో వారి వద్ద ఉన్న 10 రూ. లక్షల విలువ చేసే బంగారం, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు చెప్పారు. కేసును ఎంతో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్టు చేసి కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన కర్లపాలెం పోలీస్ స్టేషన్ సిబ్బందిని సర్కిల్ సీఐ హరికృష్ణను జిల్లా ఎస్పీ అభినందించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో పట్టణ ప్రాంతాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్లో పోలీస్ స్టేషన్లో ఉన్న అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాయల్ జర్నలిజం
ద్వి భాషా దినపత్రిక
ROYAL JOURNLISAM

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలి




కాకినాడ జూలై 26 : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఏక గవాక్ష విధానం కింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధ్యక్షతన జరిగింది. ఏక గవాక్ష విధానం క్రింద గడచిన త్రైమాస కాలంలో అందిన ధరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహనికి వివిధ రాయితీల మంజూరు, రాంప్ ప్రోగ్రామ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్.. పరిశ్రమలు, ఫ్యాక్టరీస్ , పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, గ్రౌండ్ వాటర్, సాంఘిక సంక్షేమం, అగ్నిమాపక, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 486 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 449 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని, మిగతా 37 దరఖాస్తులు వివిధ శాఖల వద్ద పరిశీలనలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులు అన్నిటిపైన నిర్దిష్ట గడువు లోపు తగిన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు పెట్టుబడి రాయితీ, పావలవడ్డీ, విద్యుత్, సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్.గణపతి, ఏడీ ఎస్.విజయ్ కుమార్, రవాణా శాఖా అధికారి జీవి.శివారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణా రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ నారాయణమూర్తి, జిల్లా అగ్నిమాపక అధికారి పీవీఎస్ రాజేష్, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ, సాంఘిక సంక్షేమం, కమర్షియల్ టాక్స్ ఇతర శాఖల శాఖల జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ సిబ్బంది అరుణ్ సందీప్, రాజేష్ కుమార్,సురేష్ కుమార్ మరియు వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# భక్త సంద్రంగా మారిన చాతుర్మాస్య ప్రాంగణం

కాకినాడ జూలై 26 :భాగ్యనగరంలో ఉత్తరాది మఠాధిపతులు శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ నిర్వహిస్తున్న 30వ చాతుర్మాస్య దీక్ష ప్రాంగణం భక్తులతో జనసంద్రంగా మారింది. ముఖ్యంగా మఠాధికారి సుధా పండితులు జయతీర్థఆచార్ పగడాల బృందం స్వీయ పర్యవేక్షణలో చేసిన ఏర్పాట్లు పట్ల భక్తులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు .శనివారం ఉదయం స్వామీజీకి పాదపూజ చేయడానికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక తమిళనాడు కేరళ మరియు ఉత్తరాది రాష్ట్రాల నుండి భక్తులు వేల సంఖ్యలో చేరుకున్నారని కాకినాడ మధ్వసభ యువజన విభాగ కమిటీ అధ్యక్షులు మధ్వ పురోహితులు యాతగిరి మద్వేష్ తెలిపారు. భక్తులను స్వామీజీ ఆశీర్వదిస్తూ కుశల ప్రశ్నలతో ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ఆధ్యాత్మిక విశేషాలను అడిగి తెలుసుకుంటూ ఫల మంత్రాక్షతులను ఇస్తున్నారని వివరించారు .అనంతరం భక్తులకు ముద్ర ధారణ కార్యక్రమాన్ని స్వామీజీ చేశారు సుమారు 70 సంవత్సరాలు తర్వాత భాగ్యనగరంలో జరుగుతున్న అపూర్వ ఆధ్యాత్మిక పండుగ వాతావరణం గా చాతుర్మాస్య పూజా కార్యక్రమాన్ని మధ్యేష్ అభివర్ణించారు .ప్రతిరోజు సాయంత్రం సుధా పండితుల ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు స్వామీజీ చే ఆధ్యాత్మిక భాషణ



వైభవంగా జరుగుతోందని మద్వేష్ చెప్పారు. 52 రోజులు పాటు జరిగే ఈ చాతుర్మాస్య వైభవంలో అందరూ పాల్గొని శ్రీమద్వాచార్య మూల మహాసంస్థానఉత్తరాది మఠం లో జరిగే శ్రీ మూల రామ దిగ్విజయరామ సంస్థాన పూజతో పాటు సువర్ణ ఊంజల సేవలో అందరూ పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు .వచ్చిన భక్తులందరికీ ఏ విధమైన అసౌకర్యం కలగకుండా వసతి సదుపాయాలను కల్పించడం గొప్ప విషయమని, తీర్థప్రసాదాలను వేలాదిమందికి ప్రతి నిత్యం ఏ విధమైన అసౌకర్యం కలుగును రీతిలో అందిస్తున్నారని మద్వేష్ చెప్పారు. సుమారు వందమందికి పైగా సుధా పండితుల కనుసన్న లలో ఏర్పాట్లు అద్భుతంగా చేయడం భక్తుల అదృష్టంగా భావిస్తున్నామని బెంగళూరుకు చెందిన పాలూర్ శ్రీనివాసమూర్తి అన్నారు .ఉత్తరాది మఠ సంస్థాన పూజలో సువర్ణ పీఠముపై శ్రీ మూలరామ దిగ్విజయరామ తో పాటు 28 అపూర్వ విగ్రహాలకు శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ పూజ చేస్తున్న దృశ్యం తిలకించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని ఆదిత్య బిర్లా కంపెనీ ప్రతినిధి సూర్యనారాయణ (సూరి )అన్నారు. ఈ వేడుకలలో బెంగళూరు జయ తీర్థ విద్యా కులపతి సుధా పండితులు రంగాచార్ గుత్తల్ దంపతులు, ముంబై శ్రీ సత్యధ్యాన విద్యాపీఠం కులపతి సుధా పండితులు మా హులి విద్యా సింహాచార్ శ్రీమతి ప్రజ్ఞా దేవి మాహులి ,సుధా పండితులు గుత్తల్ విద్యాధీశాచార్, సుధా పండితులు కట్టి సత్య ధ్యానాచార్ ,మఠ దివాన్ సుధా పండితులు శశి ఆచార్, సుధా పండితులు కానుగోవి వాసుదేవాచార్, జయతీర్థ ఆచార్ పగడాల , పద్మనాభాచార్ ప్రభులను కలిసి ప్రణామాలను అర్పించు కోవడం జరిగిందని మద్వేష్ చెప్పారు. ఈ విషయాలు ను వేముగంటి నరసింహ రావు, వై వి పరశురామ్ తెలియ చేసారు

# తురగా సూర్య అపర్ణ సౌమ్య మరియు తురగా శేష సాహితీ ముఖ్య అతిథులు చేతుల మీదుగా మెమెంటో సర్టిఫికెట్లు








కాకినాడజూలై 26 : కాకినాడ స్థానిక సూర్య కళామందిర్ నందు ఘనంగా నిర్వహించిన సంగీత సేవ స్వర రాగ సుధా సంగీత విద్యాలయం 25వ వార్షికోత్సవం లో భాగంగా తురగా సూర్యారావు మనమరాలు తురగా సూర్య అపర్ణ సౌమ్య మరియు తురగా శేష సాహితీ మెమెంటో సర్టిఫికెట్లు ముఖ్య అతిథులు చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం శ్రీ విష్ణు భట్ల శ్రీ రామ చంద్ర మూర్తి ని దుస్సాలువ తో సత్కరించిన తురగా సూర్యారావు శేషుకుమారి దంపతులు ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ నర్సింగ్ మహిళలకు జర్మన్ లాంగ్వేజి నందు ఉచిత శిక్షణ

అమలాపురం జూలై 26 : ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన మహిళా నర్సింగ్ పట్టభద్రులకు రాష్ట్ర ప్రభుత్వం జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించనుంది. రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, గిరిజన సంక్షేమం, సామాజిక సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ కార్యక్రమం తిరుపతి, గుంటూరు, విశాఖపట్నంలోని శిక్షణ కేంద్రాల్లో జరుగనుంది. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాల కోసం ఉచిత జర్మన్ భాషా శిక్షణ అందించనున్నారు. 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు అర్హులు. వీరికి పదినెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ సమయంలో భోజనం, వసతి కల్పిస్తారు. డాక్యుమెంట్ల అనువాదం, అటెస్టేషన్ ఖర్చులు, బీ2 జర్మన్ భాష పరీక్ష ఫీజు, వీసా, విమాన టికెట్ల ఖర్చులు ఉద్యోగదారులు భరిస్తారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు సుమారు రూ.2.4 లక్షల నుంచి రూ.3.1 లక్షల వరకు జీతం అందుతుంది. ఆసక్తి ఉన్నవారు జనన ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, ఇంటర్ తరగతి మార్కుల జాబితా, నర్సింగ్ డిప్లొమా సర్టిఫికేట్, బీఎస్సీ సర్టిఫికేట్ (గ్రేడ్/రేటింగ్), నర్సింగ్ లైసెన్స్ వర్క్ ఎక్స్పరియన్స్ సర్టిఫికేట్, పోలీస్ క్లియరెన్స్ గుడ్ స్టాండింగ్ సర్టిఫికేట్, వాలిడ్ పాస్పోర్ట్, మ్యారేజ్ సర్టిఫికేట్ సమర్పించాల్సి ఉంటుంది. ఆగస్టు 07 వ తేదీలోపు https://naipunyam.ap.gov.in/userregistration?pageRprogram-cregistration 3 నమోదు చేసుకోవాలి. లేదా skillinternational@apssdc.in రెస్యూమ్లు ఈమెయిల్ చేయవచ్చు. ?? ?? 9988853335, 8712655686, 8790118349, 8790117279 సంప్రదించాలని కోరారు.

# భారత వీరజవాన్ల త్యాగం మరువలేనిది: డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

కాకినాడ జూలై 26 : భరతమాత తలపై మెరిసే మంచు కిరీటమైన కాశ్మీర్ కోసం కయ్యానికి కాలుదువ్విన పాకిస్తాన్ ను ఓడించి భరతమాత సిగలో గులాబిలై వికసించిన అమర వీర జవాన్లకు నివాళులు అర్పించే కార్గిల్ విజయ్ దివస్ ను కాకినాడ ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విభాగం, కాకినాడ ఐడిఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్విహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు తెలియజేశారు.అందరూ భరతమాత చిత్రపటానికి పూలమాలలు అర్పించారు కాకినాడ ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ “ఆపరేషన్ విజయ్ విజయానికి 26 వసంతాలు అయ్యాయని, 1999వ సంవత్సరంలో కాశ్మీర్లోని సియాచిన్ ప్రాంతాన్ని ఆక్రమించడానికి పాకిస్థాన్ ప్రయత్నించగా ఆ ప్రయత్నాన్ని తిప్పికొట్టి భారత్ తమ భూభాగాన్ని చేజిక్కించుకుందని. ఆపరేషన్ విజయ్ గా పిలువబడి 60 రోజులపాటు జరిగిన ఈ యుద్ధంలో ఎంతోమంది వీరజవాన్లను కోల్పోయినామని,నియంత్రణరేఖ దాటి పాకిస్తాన్ ఆక్రమించుకున్న ప్రదేశాలను భారత సైన్యం, భారతీయ వాయుసేన సహకారంతో తిరిగి స్వాధీనపరుచుకుని ,ఇదేరోజున విజయం సాధించామని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు



మాట్లాడుతూ భారత వీర జవాన్ల త్యాగం మరువలేనిదని, మీత్యాగం వృధాకాదని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసికొవ్వొత్తుల తో నివాళులు అర్పించి,భారత్ మాతా కి జై,జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సి.సత్యనారాయణ, క్యాంపస్ ఇంచార్జ్ మూర్తి ,ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు తదితర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మరోసారి వీరమల్లు సినిమాపై విష ప్రచారం చేస్తే నాలుకలు కోస్తాం

## బాక్సాఫీసులు బద్దలు కొట్టిన సినిమా వీరమల్లు : మొదటి రోజే 111 కోట్లు కలెక్షన్




గుడివాడజూలై 26 : వైసిపి విష ప్రచారంపై ఫైర్ అయిన జన సైనికులు చరిత్రను ప్రజలకు చూపించిన వీరమల్లు సినిమాలో చిత్రీకరించిన సన్నివేశాలపై మతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా మాట్లాడుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పై జనసేన అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్రావు (గాంధీ) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొండపల్లిలోని శివకృష్ణ థియేటర్ వద్ద జరిగిన వీరమల్లు సినిమా విజయవంతమైన సందర్భంగా బాణాసంచా కాల్చారు. అనంతరం జనసేన పార్టీ అధికార ప్రతినిధి అక్కల గాంధీ మీడియాతో మాట్లాడుతూ వీరమల్లు సినిమా కల్పితం కాదని, కథ కూడా కాదని, చరిత్ర అనే విషయాన్ని వైసిపి తెలుసుకోవాలన్నారు. వీరమల్లు సినిమాపై విష ప్రచారం చేస్తున్న వైసిపి పేటీఎం బ్యాచ్ ఒక్కసారి సినిమా పూర్తిగా చూస్తే మంచి చెడు తెలుస్తాయన్నారు. మంచినీ చెడును రెండింటిని కలగలిపి కళ్ళకు కట్టినట్లుగా చూపించిన సినిమా వీరమల్లు అని అన్నారు. కుటుంబంతో సహా చూడదగ్గ సినిమా వీరమల్లు సినిమా అని, ఈ చిత్రాన్ని ఆదరించిన ప్రజలకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ చేస్తున్న విషప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు. ఇప్పటికైనా అవాకులు చవాకులు పేలటం వైసిపి పేటీఎం బ్యాచ్ మానకపోతే నాలుకలు కోస్తామని ఉమ్మడి జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బొలియశెట్టి శ్రీకాంత్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆంధ్రా కమిటీ సభ్యులు ఎర్రం శెట్టి నాని, జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి చింతల లక్ష్మి, గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రాధిక, ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, పవన్ కళ్యాణ్ అభిమానులు మరియు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోటరీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సిపిఆర్‌లో శిక్షణ




కాకినాడ జూలై 26 : పాఠశాలలో 9 మరియు 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో సిపిఆర్ లో శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రోటరీ డిస్ట్రిక్ సి పి ఆర్ ప్రోగ్రాం కమిటి చైర్ పర్సన్ డాక్టర్ ట్రస్టు రామకృష్ణ చెప్పారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశం క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఈ సి పి ఆర్ ప్రోగ్రాంలో ఐ ఆర్ సి ఎఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చక్రధర్ రావు, రోటరీ క్లబ్బులు, ఇండియన్ సొసైటీ ఫర్ క్రిటికల్ కేర్ మెడిసిన్ అసోసియేషన్ మరియు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సి పి ఆర్ ప్రోగ్రామ్లను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గుండెపోటు సంఘటనలతో ఇటీవల కాలం లో మృత్యువాత పడుతున్న సంఖ్య గణనీయంగా పెరగడం ఆందోళన కలిగించిందని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి డ్రీమ్ ప్రాజెక్టుగా సి పి ఆర్ లో రోటరీ సభ్యులతో పాటు పాఠశాల స్థాయి విద్యార్థులు సుమారు పది వేల మందికి శిక్షణ ఇవ్వాల్న లక్ష్యంతో వున్నామని అన్నారున ఈ శిక్షణ ఇవ్వడం ద్వారా తక్షణం ఈ వైద్యం చేయడం తో ప్రాణాలు రక్షించడానికి ఎంతో అవకాశం ఉంటుందని డాక్టర్ రామకృష్ణ చెప్పారు. రోటరీ సభ్యులకు కూడా సిపిఆర్ లో శిక్షణ ఇవ్వడానికి క్లబ్బు అధ్యక్షులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసిందిగా సూచించారు .కృష్ణాజిల్లా నుండి శ్రీకాకుళం జిల్లా వరకు ఉన్న 18 రెవెన్యూ జిల్లాల పరిధిలోని అన్ని రోటరీ క్లబ్ ల లో సిపిఆర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రాజెక్టు రూపొందిస్తున్నారని చెప్పారు. తొలుత కార్యదర్శి డాక్టర్ సానా ప్రవీణ్ స్వాగతం పలుకుగా కోశాధికారి ఉదయ్ చక్రవర్తి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్వీఎస్ రావు, రోటరీ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి మాచారెడ్డి, క్లబ్ మెంబర్షిప్ కమిటీ చైర్పర్సన్ చోడిశెట్టి పద్దరాజు, చార్టెడ్ అకౌంటెంట్ అసోసియేషన్ కాకినాడ చాప్టర్ అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరాజు, న్యాయవాదుల సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధి నరహరిశెట్టి రవికృష్ణ, సోనీ స్టూడియో అధినేత బుజ్జి, వేముగంటి నరసింహ రావు, డాక్టర్ వై వి పరశురామ్, యాతగిరి మద్వేష్ తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు. భారీ వర్షం కురుస్తున్న రోటరీ సమావేశాలకు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొనడం విశేషం. అందుకు క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ టీం వర్క్ నిదర్శనమని పలువురు ప్రస్తావించారు.

రాయల్ జర్నలిజం
ROYAL JOURNLISAM

# దేశ రక్షణ రంగంలో ఏపీ భాగస్వామ్యం.. కర్నూలులో డ్రోన్ నుంచి క్షిపణి ప్రయోగం సక్సెస్

అమరావతి : దేశ రక్షణ రంగంలో ఆంధ్రప్రదేశ్ తనదైన ముద్ర వేసింది. కర్నూలు జిల్లాలోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్‌లో యూఎల్‌పీజీఎం–వీ3 క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు. డీఆర్‌డీవో, ఎంఎస్‌ఎంఈ, స్టార్టప్ సంస్థలు కలిసి దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణి, యూఏవీ ద్వారా ప్రయోగించగలగడం విశేషం. తక్కువ ఖర్చుతో ఎక్కువ కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించే ఈ క్షిపణి ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు.దేశ రక్షణ రంగంలో ఆంధ్రప్రదేశ్ భాగస్వామి అయింది. కర్నూలు జిల్లాలో యూఎల్‌పీజీఎం–వీ3 క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు. కర్నూలు జిల్లాలోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్‌లో ఈ పరీక్ష జరిగింది. ఈ క్షిపణిని యూఏవీ ద్వారా ప్రయోగించవచ్చు.. ఇది కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేధిస్తుంది. ఇది దేశీయంగా అభివృద్ధి చేసిన క్షిపణి. డీఆర్‌డీవో, ఎంఎస్‌ఎంఈ, స్టార్టప్ సంస్థలు ఇందులో భాగస్వాములు. క్షిపణి ప్రయోగం విజయవంతమైందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్వయంగా



తెలిపారు. ఈ ప్రయోగానికి సంబంధించిన ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు రాజ్‌నాథ్. డీఆర్‌డీవో, క్షిపణి తయారీలో పాలుపంచుకున్న సంస్థలను ఆయన అభినందించారు.డీఆర్‌డీవో ఆధ్వర్యంలోని ఎన్‌వోఏఆర్‌లో అత్యాధునిక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ ఆయుధాల పరీక్షలు జరుగుతున్నాయి. దాదాపు 2,200 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ రేంజ్‌లో రాడార్లు, లేజర్ ఆయుధాలు వంటి వాటిని పరీక్షిస్తున్నారు. 2016–17లో ప్రారంభించిన ఈ కేంద్రంలో, యూఎల్‌పీజీఎం శ్రేణి ఆయుధాలను తపస్–బీహెచ్, ఆర్చర్ ఎన్‌జీ యూఏవీల కోసం అభివృద్ధి చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో, ఎక్కువ కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేధించే ఆయుధాలను ఇక్కడ తయారు చేస్తున్నారు. సాధారణంగా ఈడబ్ల్యూ ఆయుధాలను ముందుగా ఇండోర్‌లో పరీక్షిస్తారు. ఆ తరువాత వాటిని అందుబాటులోకి తీసుకురావడానికి 2 ఏళ్లు పడుతుంది.కానీ, బయట ప్రదేశాల్లో పరీక్షించే ఆయుధాలు త్వరగా దళాల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఇక్కడ యాంటెన్నాలు, సెన్సర్లు, రాడార్లు, ట్రాన్స్‌మీటర్లు, కమ్యూనికేషన్ పరికరాలతో పాటు డైరెక్ట్ ఎనర్జీ (లేజర్) వెపన్స్ కూడా ఉన్నాయి.. వీటిని పరీక్షిస్తున్నారు. యూఎల్‌పీజీఎం ఆయుధాలు చాలా తక్కువ ధరతో ఉత్పత్తి చేయొచ్చు. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదిస్తాయి. అత్యంత సమీపం నుంచి జరిగే పోరాటాల్లో ఫైర్ అండ్ ఫర్‌గెట్ వ్యవస్థ ఆధారంగా దీనిని ఉపయోగించవచ్చు. ఈ ఆయుధాలను పేల్చిన తర్వాత వాటి పనిని అవే చేసుకుంటాయి.మరోవైపు ఈ క్షిపణి ప్రయోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ వేదికగా రాజ్‌నాథ్ ట్వీట్‌ను ప్రస్తావిస్తూ స్పందించారు. 'మన దేశ రక్షణ వ్యవస్థ వృద్ధికి ఆంధ్రప్రదేశ్ దోహదపడటం గర్వకారణంగా ఉంది. నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ దగ్గర యూఏవీ లాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ క్షిపణి విజయవంతమవటం శుభ పరిణామం. శాస్త్రవేత్తలు ఆవిష్కర్తలకు అభినందనలు.. ఇది మన దేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన ముందడుగు. యూఎల్‌పీజీఎం–వీ3 విజయం ఆత్మనిర్భర్ భారత్ యొక్క నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు.గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్ చేరడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. హంపి పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. ఫైనల్లో ఆమె విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## తిరుమలలో క్యూలో వేచి ఉండకుండా నేరుగా దర్శనం..

అమరావతి :తిరుమలలో క్యూలో వేచి ఉండకుండా సులభంగా దర్శనం చేయిస్తామని భక్తుల నుంచి డబ్బులు వసూలు చేసిన దళారుల గుట్టు రట్టయింది. టీటీడీ ప్రైవేటు సెక్యూరిటీ గార్డుతో కలిసి ఎమర్జెన్సీ గేటు తెరిచి 24 మందిని క్యూలైన్‌లోకి పంపారు. పోలీసులు సెక్యూరిటీ గార్డును అరెస్టు చేశారు. భక్తులు దళారులను నమ్మి మోసపోవద్దని టీటీడీ సూచించింది. మరోవైపు, టీటీడీ పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చేందుకు 'సద్గమయ' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తిరుమలలో క్యూలో వేచి ఉండకుండా సులభంగా దర్శనం చేయిస్తామని చెప్పి దళారులు భక్తుల నుంచి డబ్బులు వసూలు చేశారు. టీటీడీ ప్రైవేటు సెక్యూరిటీ గార్డుతో కలిసి, ఎమర్జెన్సీ గేటు తెరిచి 24 మంది భక్తులను క్యూలైన్‌లోకి పంపారు. విచారణ తర్వాత సెక్యూరిటీ గార్డును పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతిలోని అలిపిరి భూదేవి కాంప్లెక్స్ దగ్గర %వాణ% టోకెన్ల కోసం భక్తులు వేచి ఉన్నారు. అప్పుడు ఇద్దరు ట్యాక్సీ డ్రైవర్లు (కె వెంకటేష్, డి వెంకటేష్) అక్కడికి వచ్చారు. తిరుమల శ్రీవారి ఉచిత దర్శనం క్యూలోకి పంపిస్తామని చెప్పి 24 మంది నుండి రూ.1500 చొప్పున వసూలు చేశారు.తిరుమలలో ఈ భక్తుల్ని ట్యాక్సీ క్లీనర్ వెంకటేష్‌కు వారిని అప్పగించారు. ఆయన వారిని తీసుకెళ్లి తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్–2 దగ్గర పనిచేసే టీటీడీ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు పి.సాయికుమార్‌కు రూ.8 వేలు ఇచ్చాడు.. భక్తులను క్యూలైన్‌లోకి పంపమని కోరాడు. ఏకంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ ప్రధాన ద్వారం దగ్గర సెక్యూరిటీ గార్డు సాయికుమార్ ఎమర్జెన్సీ గేట్ తాళాలను వెంకటేష్‌కు ఇచ్చేశాడు. అలా ఆ గేటు నుంచి ఉదయం 8 గంటలకు మొత్తం 24 మందిని లోపలికి పంపాడు.. వారంతా దర్శన టోకెన్లు తీసుకుని క్యూ లైన్ నుంచి బయటకు వచ్చారు.మళ్లీ వారంతా వారికి కేటాయించిన సమయం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటలకు అదే గేటు దగ్గరకు దర్శనం కోసం రావడంతో విజిలెన్స్ అధికారులు అనుమానం వచ్చింది.. వెంటనే ఆరా తీస్తే ఇదంతా బయటపడింది. ఈ క్రమంలో ఇద్దరు ట్యాక్సీ డ్రైవర్లు, క్లీనర్ వెంకటేష్, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు సాయికుమార్‌ను విజిలెన్స్ సిబ్బంది అదుపులోకి తీసుకుని తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. భక్తులు దళారుల్ని నమ్మి మోసపోవద్దని టీటీడీ సూచించింది.'తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా జూలై 28వ తేదీన టిటిడి పాఠశాలల్లోని విద్యార్థులకు మానవీయ, నైతిక విలువ, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చేందుకు సద్గమయ కార్యక్రమాన్ని చేపడుతున్నారు

## చౌటుప్పల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..



హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఖైతాపురం వద్ద ఓ స్కార్పియో డివైడర్‌ను ఢీకొట్టి, ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో ఏపీకి చెందిన ఇద్దరు డీఎస్పీలు చక్రధర్ రావు, శాంతారావు మృతి చెందారు. ఏఎస్పీ కేవీఎస్ ప్రసాద్, డ్రైవర్ నర్సింగ్ తీవ్రంగా గాయపడ్డారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఖైతాపురం వద్ద ఓ స్కార్పియో వాహనం ఢీవైడర్‌ను ఢీకొట్టి అనంతరం ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏపీకి చెందిన ఇద్దరు పోలీస్ ఉన్నతాధికారులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు ఏపీ ఇంటలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్‌లో డీఎస్పీలుగా పని చేస్తున్న చక్రధర్ రావు, శాంతారావుగా గుర్తించారు.ఏఎస్పీ కేవీఎస్ ప్రసాద్, డ్రైవర్ నర్సింగ్ తీవ్రంగా గాయపడగా.. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తుండగా.. ఈ ప్రమాదం చోటు చేసుకుంది. యాక్సిడెంట్‌కు డ్రైవర్ నిద్రమత్తే కారణంగా తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతుల కుటుంబాలకు సమాచారం అందించారు. కాగా, ఈ యాక్సిడెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.కాగా, ఇటీవల తెలంగాణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ బైపాస్‌లోని దుర్గాపురం స్టేజి వద్ద నెల క్రితం జరిగిన ప్రమాదంలో ఏపీలోని కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్సై అశోక్, కానిస్టేబుల్ స్వామి అక్కడికక్కడే మృతి చెందారు. ఒక కేసు విషయమై హైదరాబాద్‌కు వెళ్తుండగా వీరి కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో స్పాట్‌లోనే వారు ప్రాణాలు కోల్పోయారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం చేర్యాల గేటు వద్ద జులై 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫిల్మ్ నగర్ ఎస్ఐ రాజేశ్వర్ మృతి చెందారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద బందోబస్తు నిర్వహించి తిరిగి వెళ్తుండగా ఆయన కారును లారీ ఢీకొట్టింది.ఈ వరుస ఘటనలు పోలీసు శాఖలో తీవ్ర విషాదాన్ని నింపాయి. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రభుత్వం, పోలీసు శాఖ వివిధ చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. అతివేగం, నిద్రమత్తు, సరైన అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల ఇలాంటి దుర్ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

## మాజీ మంత్రి పెద్దిరెడ్డి గన్‌మెన్ సస్పెండ్..

అమరావతి : పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన గన్‌మెన్ కాలేషాను సస్పెండ్ చేస్తూ ఎస్పీ మణికంఠ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దిరెడ్డి తన కుమారుడిని చూడటానికి రాజమండ్రి జైలుకు వెళ్లినప్పుడు కాలేషా వ్యక్తిగత సహాయకుడిగా వ్యవహరించాడని ఆరోపణలు వచ్చాయి. భద్రతా విధులను విస్మరించి, దుప్పటి, దిండు మోస్తూ కనిపించడంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విచారణ జరిపి సస్పెండ్ చేశారు.పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మరో షాక్ తప్పలేదు. పెద్దిరెడ్డి గన్ మెన్ కాలేషాను సస్పెండ్ చేశారు. కాలేషా తన విధులను సరిగా నిర్వహించలేదని చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ ఈ చర్యలు తీసుకున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మద్యం కుంభకోణంలో అరెస్టైన తన కుమారుడు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని చూడటానికి ఈ నెల 23న రాజమహేంద్రవరం వెళ్లారు. పెద్దిరెడ్డి జైలు లోపలికి వెళ్లేటప్పుడు, ఆయన వెంట కాలేషా ఉన్నారు.ఆ సమయంలో ఏఆర్ కానిస్టేబుల్ అయిన కాలేషా గన్‌మెన్‌గా ఉండి భద్రతా పనులు చూడకుండా వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశారని ఆరోపణలు వచ్చాయి. ఆయన




దుప్పటి, దిండు, భోజనం క్యారియర్ మోస్తూ కనిపించాడు. కాలేషా ఆ వస్తువుల్ని మోయడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. వెంటనే దీనిపై ఎస్పీ విచారణ జరిపారు.. విచారణలో కాలేషా తప్పు చేసినట్లు తేలింది. దీంతో ఎస్పీ మణికంఠ కాలేషాను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గన్‌మెన్‌గా ఉండి భద్రతా విధుల్లో సెక్యూరిటీ చూడాల్సింది పోయి, పర్సనల్ అసిస్టెంట్ లాగా పనిచేశారనే విమర్శలు వచ్చాయి.ఏపీ లిక్కర్ కేసులో మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని సిట్ అరెస్ట్ చేసింది. ఆయన్ను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.. ఈ క్రమంలో పెద్దిరెడ్డి కుటుంబం కూడా అక్కడే ఉంటోంది. రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మిథున్ రెడ్డి, తనకు ఇంటి భోజనంతో పాటు ఇతర సౌకర్యాలు కావాలని కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు, జైలు సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం సౌకర్యాలు కల్పిస్తామని జైలు అధికారి కోర్టుకు తెలిపారు. ఇంటి భోజనం కోసం అండర్‌టేకింగ్ లెటర్ అవసరమని కూడా చెప్పారు. ఈ నేపథ్యంలో మిథున్ రెడ్డి కోసం పెద్దిరెడ్డి కుటుంబం రాజమండ్రిలో ఇల్లు అద్దెకు తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. మిథున్ రెడ్డికి ఇంటి భోజనం పంపించేందుకు పెద్దిరెడ్డి కుటుంబం రాజమండ్రిలో ఇల్లు అద్దెకు తీసుకుందని సమాచారం.

## నందమూరి బాలకృష్ణ పెద్ద మనసు.. అభిమానికి భారీ సాయం, ఏకంగా లక్షల్లో

అమరావతి : నందమూరి బాలకృష్ణ తన అభిమాని పట్ల మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన బద్రిస్వామి అనే అభిమాని కాలేయ వ్యాధితో బాధపడుతుంటే, ఆయనకు వైద్య సహాయం అందించడానికి బాలకృష్ణ ముందుకు వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందేలా చేశారు. అంతేకాదు, బాలకృష్ణ సతీమణి వసుంధర హిందూపురం నియోజకవర్గంలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.హిందూపురం ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు. అనారోగ్యం కారణంగా కష్టాల్లో ఉన్న అభిమానికి అండగా నిలిచారు.. వైద్యానికి అవసరమైన సాయం అందించారు. కర్నూలు జిల్లాలోని ఆదోనికి చెందిన బద్రిస్వామి బాలయ్య వీరాభిమాని. ఆయన కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. బద్రిస్వామి వైద్యానికి రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. అన్ని లక్షల రూపాయలు వెచ్చించి ట్రీట్మెంట్ చేయించుకునేంత ఆర్థిక స్థోమత లేకుండా పోయింది. దీంతో చికిత్స చేయించుకోలేని పరిస్థితి ఎదురైంది.బద్రిస్వామి ఆరోగ్య పరిస్థితి గురించి ఆదోని పట్టణ నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు సజ్జాదాస్సేన్‌కు తెలిసింది. వెంటనే ఆయన నందమూరి బాలయ్య దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన హిందూపురం ఎమ్మెల్యే.. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.10 లక్షలు సాయం చేశారు. ఈ మేరకు బద్రిస్వామికి రూ.10 లక్షలకు ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఆ పత్రాన్ని బాలకృష్ణ సతీమణి వసుంధర బద్రిస్వామికి అందజేశారు. తన సమస్య గురించి తెలియగానే స్పందించి సాయం చేసిన బాలయ్యకు బద్రిస్వామి ధన్యవాదాలు తెలిపారు.ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భార్య వసుంధర హిందూపురం నియోజకవర్గంలో పర్యటించారు. ఆమె గోళ్ళాపురం పారిశ్రామికవాడలో రూ.3 కోట్లతో నిర్మించిన విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. వసుంధర చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి నుంచి తమ్మినాయనపల్లి వరకు రూ.కోటితో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఉపాధి హామీ నిధులతో ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. అలాగే స్థానికంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.. వసుంధర స్వయంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో



అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ఒకవేళ స్థానికంగా ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. బాలయ్య ఎక్కడ ఉన్నా తన నియోజకవర్గం అభివృద్ధి గురించే ఆలోచిస్తారని.. నియోజకవర్గంలో పరిశ్రమలు అభివృద్ధి చేసి, యువతకు ఉద్యోగాలు కల్పించడమే ఆయన లక్ష్యమన్నారు. బాలకృష్ణ హిందూపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఎంతో కష్టపడుతున్నారన్నారు నందమూరి వసుంధర.

## పులస చేపలు కొంటున్నారా.. ఈ విషయం కచ్చితంగా తెలుసుకోండి, మోసపోవద్దు

అమరావతి : గోదావరి జిల్లాల్లో పులస చేపల సీజన్ ప్రారంభం కాగా, వీటి కోసం జనాలు వేల రూపాయలు వెచ్చిస్తున్నారు. అయితే, పులసల పేరుతో విలస చేపలను అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోల్‌కతా, హౌరా నుండి విలస చేపలను తెచ్చి యానాం మార్కెట్‌లో పులసల పేరుతో విక్రయిస్తున్నారు, దీని వల్ల వినియోగదారులు మోసపోతున్నారు. పులస, విలస చేపల రుచిలో తేడాను గుర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు.గోదావరి జిల్లాల్లో పులస చేపల సీజన్ మొదలైంది.. గోదావరికి ఎర్ర నీరు వచ్చి చేరుతుండటంతో పులసలు కూడా క్యూ కట్టాయి. మత్స్యకారులకు ఒకటి, అర అన్నట్లుగా అక్కడక్కడ పులసలు దొరుకుతున్నాయి. అలా దొరికిన పులసల కోసం జనాలు ఎగబడతున్నారు.. కేజీ చేప కోసం ఏకంగా వేల రూపాయలు వెచ్చిస్తున్నారు. అయితే పులసల పేరుతో మరో కొత్త దందా జరుగుతోంది.. పులస చేపల పేరు చెప్పి విలస చేపల్ని అందగడుతున్నారనే టాక్ వినిపిస్తోంది. గోదావరిలో పులస చేపలు కనిపించకపోయినా.. యానాం మార్కెట్లో మాత్రం పుష్కలంగా దొరుకుతున్నాయట.యానాం మార్కెట్‌లో పులస



చేపల గురించి ఆరా తీస్తే.. కొందరు వ్యాపారులు కోల్‌కతా, హౌరా నుంచి విలస చేపలను తెచ్చి పులసల పేరుతో అమ్ముతున్నారట. పులస చేపలకు ఉన్న డిమాండ్‌ను వీరు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం అక్కడ విలస చేపలు సైజును బట్టి రూ.600 నుంచి రూ.1300 వరకు పలుకుతున్నాయి. గోదావరి జిల్లాల్లో పులస చేపలకు మంచి డిమాండ్ ఉందని తెలిసి విలస చేపలను తెచ్చి అమ్ముతున్నారట. బంగాళాఖాతంలో లభ్యమయ్యే ఈ విలస చేపల్ని హౌరా, కోల్‌కతా నుంచి రైళ్లలో కాకినాడకు తెస్తున్నారు. అక్కడి నుంచి ఆటోల్లో యానాం మార్కెట్‌కు పులస చేపల్ని చేరవేస్తున్నారు. అయితే చూడటానికి రంగు, వాసన ఒకేలా ఉంటుంది.. కానీ విలస, పులస చేపల రుచిలో తేడా ఉంటుంది.విలస చేప, పులస చేప వ్యత్యాసాన్ని కూడా కనిపెట్టొచ్చుట.. గోదావరిలో పట్టుకొచ్చిన పులస చేపను వెంటనే మార్కెట్‌కు తీసుకొచ్చి వేలం పాట నిర్వహిస్తారు.. కాబట్టి తాజాగా ఉంటుంది. ఈ విలస చేపల్ని సముద్రంలో పట్టుకుని యానాంకు తీసుకొచ్చేసరికి రెండు, మూడు రోజుల సమయం పడుతుంది.. అప్పుడు ఆ చేపలు చూడటానికి తాజాగా ఉండవు. అలా విలస, పులసల మధ్య తేడాను తెలుసుకోవచ్చంటున్నారు. అయితే ధవళేశ్వరం, రాజమహేంద్రవరం మార్కెట్లో దొరికే పులస చేపల రుచి బావుంటుంది అంటున్నారు. అంతేకాదు గోదావరిలో కూడా పులస చేపలు పెద్దగా వలకు చిక్కడం లేదని చెబుతున్నారు. పదుల సంఖ్య లోనే చేపలు దొరుకుతున్నాయట.. ఒకప్పుడు లక్షల్లో వ్యాపారం జరిగేదని.. ఇప్పుడు అంత వ్యాపారం లేదంటున్నారు.

రాయల్ జర్నలిజం
ROYAL JOURNLISAM


# చరిత్ర సృష్టించిన భారత రైల్వే..

## దేశంలో మొట్ట మొదటి హైడ్రోజన్‌తో నడిచే ఇంజన్ ఇదే!



